క్లుప్తంగా

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



జానకమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ పోశివేణి

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన దాకమూరి జానకమ్మ అనారోగ్యంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ మాగాపు పోశివేణి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేసింది.

650 పశువులకు టీకాలు

సీతానగరం: చినకొండేపూడి, ముగ్గళ్ల గ్రామాల్లో 650 పశువులకు టీకాలు వేశామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఆంథ్ర ఫణీంద్ర తెలిపారు. శుక్రవారం చినకొండేపూడి-1, ముగ్గళ్ల గ్రామాల్లో ఆవులు, గేదెలు, దూడలు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి (గాళ్లు) నివారణ టీకాలు వేశారు. నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారి పశువులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెదుళ్లపల్లి ఆసుపత్రి కాంపౌండర్ ఆదిలక్ష్మి, ఏహెచ్ఎలు వై.సుధాకర్, గీతిక, షేక్ యాస్మిన్, వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, అశోక్ చక్రవర్తి, సౌశీల్య పాల్గొన్నారు.

582 మందికి వైద్యసేవలు



రాపాకలో ఇంటి వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చైతన్య

సీతానగరం: మండలంలోని రాపాక సచివాలయంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 582 మందికి పీహెచ్సీ డాక్టర్ ఏవీకే చైతన్య వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి చికిత్స చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్సీ హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మి, సుధాకర్, ఏఎన్ఎం సుజాత, ఆశ వర్కర్లు దేవి, రాణి పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించడం అందరి బాధ్యత



చంద్రేడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది, విద్యార్థులు

రంగంపేట: ఆడపిల్లలను రక్షించడం అందరి బాధ్యతని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అన్నారు. చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బేటీ బచావో-బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడ పిల్లలను చదివించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించి అనంతరం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జాస్తి సత్తిబాబు, కంటిపూడి జెమీ, ఎంపీహెచ్ఏ జి. సూర్యప్రకాశరావు, ఎంఎల్ హెచ్‌పీలు కె.హంపిప్రకాశం, బి.రేణుకాప్రియ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణలో భాగస్వాములు కావాలి

గోకవరం: వన్యప్రాణుల సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఫోక్స్‌పేట రేంజర్ ఎం.కరుణాకర్ కోరారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సూదికొండ అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మానవ చర్యల ద్వారా వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అడవిలో నిప్పు రగిల్చడం ద్వారా వన్యప్రాణులు అంతరించే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రాజా, భూపాల్, ప్రశాంత్ కుమార్, మనోహర్, శ్రీను, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట: సింగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా అనేక గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని సింగంపల్లి, నల్లమిల్లి, చినదొడ్డిగుంట, మర్రిపూడి గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

అంగరంగ వైభవంగా..

- కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు
- రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన రథోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత స్వామివారి రథాన్ని ప్రారంభించగా, దేవస్థానం అనువంశిక ధర్మకర్త ఎస్వీ రంగరాజ బట్టర్ కుంభాన్ని పగలగొట్టారు. కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. భక్తులు శుక్రవారం ఉదయమే స్థానిక దేవుని కోనేటిలో స్నానమాచరించారు. కొండపైన కొలువుదీరిన స్వయంభూ నరసన్నను దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. కోరుకొండ పంచాయతీ, మండల పరిషత్ అధికారులు కోనేటిని శుభ్రం చేసి, భక్తులకు అనువుగా తీర్చిదిద్దారు.

రెడ్డి పంతులు సత్రం దాతృత్వం

స్థానికంగా ఈ సత్రాన్ని ఉత్సవాల కొచ్చే భక్తులకు భోజన సదుపాయం కల్పించాలన్న లక్ష్యంతో రెడ్డి పంతులు ఏర్పాటు చేశారు. వందల ఏళ్లుగా ఉత్సవాల సందర్భంగా భక్తులకు భోజనాన్ని అందిస్తున్నారు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకూ రెండు పూటలా ఈ కార్యక్రమం జరుగుతుంది.

స్థానికుల వితరణ

స్వామివారి కల్యాణోత్సవాలకు వచ్చిన భక్తులకు స్థానికులు పులిహోరా, వెజ్ బిర్యాని, పెరుగు అన్నం, మజ్జిగ తదతర వాటిని వితరణ చేశారు. దేవస్థానం రోడ్డంతా ఇలా చేస్తున్న దాతలతో నిండిపోయింది. భోజనం, అల్పాహార శాలలు లేని రోజుల్లో మొదలైన ఈ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. నేటి నుంచి వివిధ వాహనాలపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు.



స్వామికి పూజలు చేస్తున్న మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



స్వామివారికి పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డాక్టర్ రాజశ్రీ దంపతులు



మెట్ల మార్గంలో కొండపైకి వెళుతున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తింపు

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా నూతనంగా ఎంపికైన అనపర్తికి చెందిన పెనుగొండ శ్రీనివాసరావు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఎమ్మెల్యేతో పాటు పద్మశాలి సంఘ నాయకులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, ఎంపీటీసీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు, పద్మశాలి సంఘం నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, కానూరి కృష్ణ, శంకర్, రాజు, అనిల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపికై బాధ్యతలు చేపట్టిన కొవ్వూరు నియోజకవర్గం పంగిడి గ్రామానికి చెందిన చౌటుపల్లి వీరన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పెనుగొండ శ్రీనివాసరావు

వేసవిలో వచ్చే వ్యాధులపై అవగాహన అవసరం

గోకవరం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే పీఎంపీలు వేసవిలో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ఎక్స్‌పర్ట్ ఆస్పత్రి డాక్టర్ వి.జయవర్ధిని అన్నారు. మండలంలోని బావాజీపేట శివారున అష్టలక్ష్మి ఆలయ సమీపంలో శుక్రవారం గోకవరం, ఏజెన్సీ మండలాల్లో సేవలందిస్తున్న పీఎంపీలకు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్ని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయవర్ధిని మాట్లాడుతూ వేసవిలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో వచ్చే పలు వ్యాధులు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. పీఎంపీలు సంఘం నియమ నిబంధనలకు లోబడి వైద్య సేవలందించాని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఏబీటీ రాజు సూచించారు. జిల్లా కార్యదర్శి బళ్లా శ్రీనివాస్‌రావు, డాక్టర్ బి.రవి కుమార్, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జయవర్ధిని

బాలికల చదువుతో సమాజానికి మేలు

గోకవరం: బాలికలు చదువు కోవడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి సీహెచ్ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్.రాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ శైలజ అన్నారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లలను కాపాడుకుందాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలు చదువుకొని అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏఎన్ఎంలు నాగలక్ష్మి, సూర్యకాంతం, ఎస్‌టీఎస్ శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పవన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

‘నన్నయ’లో మహిళలకు క్రీడా పోటీలు



మహిళల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శుక్రవారం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ డెవలప్‌మెంట్ అండ్ గ్రీవెన్ సెల్ ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సహకారంతో ప్రారంభమైన ఈ పోటీలను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ లాంఛనంగా ప్రారంభించారు. పరుగు పందెం, రేస్ వాకింగ్, క్రికెట్, త్రోబాల్ తదితర పోటీలలో యూనివర్సిటీలోని బోధన, బోధనేతర మహిళా సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమణేశ్వరి, డాక్టర్ కె.సూక రత్నం, డాక్టర్ పి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

అనపర్తి: సామాన్య ప్రజలకు సైతం ప్రభుత్వాసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వార్డులను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రత, వైద్య సిబ్బంది పని తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న సమయంలో ఆసుపత్రిలో సుమారు 25 మంది వైద్య సిబ్బంది రోగులకు సేవలందించారన్నారు. స్థానిక ప్రజల కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా స్థాయి పెంచారన్నారు. ఇక్కడ 96 మంది సిబ్బందిని కేటాయించగా ఇప్పటివరకు 66 మంది విధుల్లో చేరారన్నారు. ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో ఆసుపత్రిలో 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆసుపత్రిలో రూ.66 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన బ్లడ్ టెస్ట్ యూనిట్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గుంటూరు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు కర్రి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

పెదపూడి: ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం సూపరింటెండెంట్ పి.సుజాత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ఆస్పత్రి ఆధునికీకరణ పనులతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రి ఆధునికీకరణ పనులు త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి దాతల సహకారం అవసరమన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోరా బాబి, కాకర సాయి బాబు, ఎంపీడీఓ పి.విజయభాస్కర్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు తదితరులు పాల్గొన్నారు.



పెదపూడి సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



ముంగర జాన్‌బాబు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా పైడిచింతపాడు గ్రామానికి చెందిన ముంగర జాన్‌బాబు (21) గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. దివాన్ చెరువులోని ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. గురువారం రాత్రి సమయంలో స్నేహితుని బైక్ తీసుకుని, మరో స్నేహితుడితో కలిసి రాజమహేంద్రవరం వచ్చాడు. తిరిగి వెళ్తుండగా దివాన్ చెరువు జీరోపాయింట్ వద్ద బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన జాన్‌బాబును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బైక్ వెనుక స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ జాన్‌బాబు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అతడి చిన్నాన్న నాగరాజు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి కంటే మర్నాడు మెరుగ్గా ఉండాలి

- నాడు-నేడు, జగనన్న కిట్ల విషయంలో రాజీ ప్రసక్తే లేదు
- పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

కంబాలచెరువు: నాడు - నేడు పనులు, విద్యార్థులకు అందించే జగనన్న కిట్ల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఇది విద్యాశాఖకు అత్యంత ప్రతిష్టాత్మకమని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. వీటి పంపిణీలో ఎవరైనా అలసత్వం వహించే సహించేది లేదన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం రాజమహేంద్రవరం వచ్చారు. నగరంలోని నన్నయ మున్సిపల్ స్కూల్, ఆర్యాపురం పంతం సత్యనారాయణ హైస్కూల్, తుమ్మలావ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాబోధన, ఫలితాల్లో నేటి కంటే మర్నాడు మరింత మెరుగ్గా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, పిల్లల్లో పౌష్టికాహార లోపం అధిగమించేందుకు, సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన పౌరసేవలను అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధ్యాయులకు, పిల్లలకు అందజేసిన ట్యాబ్‌లకు సంబంధించి వారు వాడిన నిమిషాల ఆధారంగా ర్యాంకింగ్ ఇస్తామన్నారు. 7500 నిమిషాలు ఐతే డిస్టింక్షన్, 6 వేలు అయితే ఫస్ట్ డివిజన్, 3 వేలు అయితే పాస్ అయినట్లు అని పిల్లలకు తెలిపారు. వర్క్‌బుక్స్ పరిశీలించి విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

సచివాలయం సందర్శన

పాఠశాలల పరిశీలన అనంతరం ఆయన నగర పాలక సంస్థ పరిధిలోని 35, 36, 37 వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందజేస్తున్న పౌర సేవల వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో మొబైల్ యాప్ ద్వారా ఆ సచివాలయం ద్వారా ప్రయోజనం కలుగుతున్న వారి డేటా, వారికి అందజేసిన సంక్షేమ పథకాలను పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ కె.మాధవీలత, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ పరిశీలించిన స్కూళ్లలో రాజమహేంద్రవరంలోని విద్యార్థులు నూటికి నూరుశాతం షూ, యూనిఫాం, బెల్టులు ధరించి వచ్చారన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహంను అభినందించారు.

పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలి

కాకినాడ డీపీఓ విక్టర్

పెదపూడి: పారిశుద్ధ్యం మరింత మెరుగుపరిచి ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి అధికారులు కృషి చేయాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. రాజుపాలెం గ్రామంలో సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో చెత్త తొలగింపు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ అపారిశుద్ధ్యం నెలకొన్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హులకు సంక్షేమ పథకాలు బాధ్యతగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, సచివాలయ కార్యదర్శులు ఎస్వీ స్వామి, మన్యం శ్రీనివాస్‌చౌదరి, వీఆర్వో పంపన శ్రీను, గ్రామ సర్పంచ్ గుత్తుల పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.



చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

చేనేత రంగ సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

పెదపూడి: చేనేత రంగ సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర ఆప్కో చైర్మన్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి అన్నారు. పెదపూడిలో ఆయన గురువారం రాత్రి స్థానిక పద్మశాలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ పద్మశాలీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. పద్మశాలీలందరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి కృషి చేయాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ పప్పు సింహాచలం ఆయనకు శాలువా కప్పి, గజమాల వేసి సత్కరించారు.

ఘనంగా కేశవస్వామి కల్యాణం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో శ్రీదేవి, భూదేవి సమేత కేశవ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి మాఘమాసం ఏకాదశి పురస్కరించుకుని అర్చకులు కేశవ చార్యులు ఆధ్వర్యంలో స్వామి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కర్రి ఆదిలక్ష్మి, ఆలయ ఈవో కె.సుబ్రహ్మణ్యం, రొంగల అప్పాజీ, సత్తి హరిప్రసాద్‌రెడ్డి, గండి వాసు, కర్రి ఇస్రారెడ్డి తదతరులు పాల్గొన్నారు.



కేశవ స్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నసమారాధన

కడియం: మండల కేంద్రమైన కడియంలోని పడాల వారి వీధిలో ఇటీవల పునర్నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా శేషవాహన సేవ

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి శేషవాహన సేవ వైభవంగా జరిగింది. కోలాట భజన బృందాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారి ఊరేగింపులో గ్రామస్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీమాన్ ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో శుక్రవారం రాత్రి కల్యాణ కన్నుల పండువగా జరిగింది. ఆయా కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అలాగే శనివారం ప్రత్యేక హోమాలు, ఆదివారం వేద ఆశీర్వచనం, సోమవారం నిత్యహోమాలు నిర్వహించనున్నారు. మంగళవారం పూర్ణాహుతి, చక్రస్నానం అనంతరం ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన జరుగుతుంది.

అరుణాచలానికి స్పెషల్ బస్సు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం అరుణాచలానికి ఆర్టీసీ స్పెషల్ బస్సు బయలుదేరింది. డిపో మేనేజర్ షేక్ షబ్నం మాట్లాడుతూ అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం నాన్ ఏసీ సూపర్ లగ్జరీ బస్సును భక్తులు బుక్ చేసుకుని బయలుదేరి వెళ్లారన్నారు. భక్తులు బస్సుకు సరిపడా ఉంటే ఎక్కడికైనా, ఎప్పుడైనా బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.